

కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, జూలై 11 : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌సీ 2023 అమలు చేయాలని, జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.4వేలకు పెంచాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు జిల్లా హెడ్ క్వార్టర్‌లో భవన వసతిని ఏర్పాటు చేయాలని తెలిపారు.

రాజకీయ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు..

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మాజీ మంత్రి కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నియోజకవర్గ నాయకులు

కొడంగల్, జూలై 11 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు నియోజవకర్గ బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్, దుద్యాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చాంద్‌పాషా, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ తదితరులు కొడంగల్‌లో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ తాజా పరిణామాలను దృష్టికి తీసుకెళ్లారు.

సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి ఎటువంటి అధికారం లేకున్నప్పటికీ అధికార కార్యక్రమాల్లో పాల్గొని రాజకీయ దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్‌ను అణిచివేస్తున్నట్లు తెలిపారు. అధికారుల సైతం నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అధికార కార్యక్రమానికి సంబంధించి ప్రజాప్రతినిధులకు అధికారులు ఎటువంటి సమాచారాన్ని అందించడం లేదని తెలిపారు. ఆయా సందర్భాల్లో ప్రొటోకాల్‌పై రగడ జరిగిన ప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేవిధంగా కొనసాగితే ప్రొటోకాల్ అనేది కనుమరుగౌతుందని, అధికారం ఉంటే చాలు అన్నట్లుగా మారుతున్నదని, దీనిపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని వారు కోరారు.

అదేవిధంగా ఇటీవల బొంరాస్‌పేట మండల సోషల్ మీడియా అధ్యక్షుడు నెహ్రూనాయక్ భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా సానుభూతిని తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బాల్క సుమన్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హనుమంతరావు

వికారాబాద్, జూలై 11 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ గ్రూప్-1 మెయిన్స్ పోటీ పరీక్ష శిక్షణ కోసం జూలై 19 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ గ్రూప్-1 మెయిన్స్ పోటీ పరీక్షల కోసం మైనార్టీ కులాల అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించుటకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. శిక్షణా తరగతులను అర్హులైన జిల్లా మైనార్టీలు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్శీలు) తమ దరఖాస్తులను జూలై 19లోగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మూడో ఫ్లోర్, జామియా నిజాం కాంప్లెక్స్, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్‌లో సమర్పించాలన్నారు. జూలై 22 నుంచి దరఖాస్తు సమర్పించినవారికి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాలకు 040-23236112, directormsccctelangana@gmail.comలో పని రోజుల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని సూచించారు.

వైద్యారోగ్య సిబ్బందికి సహకరించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్ కుమార్

వికారాబాద్, జూలై 11 : ఫుడ్ హ్యాండ్లర్స్‌కు ఏవైనా అంటువ్యాధులు ఉన్నట్లైతే గుర్తించడం కోసం హెల్త్ స్క్రీనింగ్ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని రిక్షా కాలనీలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సందర్శించారు. అనంతరం పాఠశాల, కళాశాలలోని వంటశాల, భోజనశాల, నీటి సరఫరా పైపులైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో అక్కడక్కడ హాస్టల్ విద్యార్థులకు సంక్రమిస్తున్న అంటువ్యాధులను నివారించడానికి జిల్లాలోని అన్ని హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే నాన్ టీచింగ్ స్టాఫ్, ఫుడ్ హ్యాండ్లర్స్‌కు ఏవైనా అంటువ్యాధులు ఉన్నవేమో గుర్తించడం కోసం హెల్త్ స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ స్క్రీనింగ్ ద్వారా సిబ్బందికి ఏవైనా వ్యాధులున్నట్లయితే వారికి తగు చికిత్స అందించి ప్రాథమిక దశలోనే వ్యాధిని నివారించడమే కాకుండా వీరి నుంచి విద్యార్థులకు కూడా సంక్రమించకుండా జాగ్రత్తపడినవాళ్లం అవుతామన్నారు. స్క్రీనింగ్ ప్రక్రియకు వైద్యారోగ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్ కుమార్

జనాభా నియంత్రణకు కృషి చేయాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

జనాభా నియంత్రణ అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మి

షాద్‌నగర్‌టౌన్, జూలై 11 : జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని గురువారం ప్రారంభించారు. అదే విధంగా పట్టణ ముఖ్య కూడలిలో మానవహారంగా ఏర్పడి జనాభా నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ జనాభా నియంత్రణకు కృషి చేయాలన్నారు. రోజురోజుకూ జనాభా పెరిగిపోవడంతో పాటు ప్రకృతి వనరులను విపరీతంగా వాడుకోవడం ద్వారా ప్రకృతిలోని సంపద హరించిపోతున్నదన్నారు. జనాభా పెరుగుదలపై ప్రజలను చైతన్యపరచడంతో పాటు కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు.

కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్లు ప్రవంతి, రాఘవేందర్, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈవో శ్రావణ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు అమృత, శ్రీరామ, పీహెచ్‌ఏలు పుష్పలీల, రెడ్యానాయక్, గౌస్, రవి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్
- చన్‌వెల్లి, దామరగిద్ద గ్రామాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే

చేవెళ్ల రూరల్, 11 జూలై : సీజనల్ వాధ్యులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు దరిచేరవని రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ అన్నారు. గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో రెండో రోజూ చన్‌వెల్లి, దామరగిద్ద గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వే కార్యక్రమానికి జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ హాజరై ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, శుభ్రత, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నచిన్న కుంటల్లో వర్షం, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని సేవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రఘుబాబు, సీహెచ్‌వోలు గోపాల్‌రెడ్డి, సుదర్శన్, వైద్యులు బాలకృష్ణ, బలరాం, అన్వర్, పద్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తమ భూమిని ఇప్పించాలని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎన్కెపల్లి గ్రామస్తులు, రైతులు

భూ కబ్జాదారులపై

చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

వికారాబాద్, జూలై 11 : శ్మశానవాటిక భూమితో పాటు, రైతుల భూములను కబ్జా చేసినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్కెపల్లి గ్రామస్తులు, రైతులు పేర్కొంటున్నారు. గురువారం ఎన్కెపల్లి గ్రామంలో శ్మశానవాటిక, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సర్వే నం.99, 101లో ప్రభుత్వ భూమి ఉంది. అప్పట్లో భూమిని రైతులకు ప్రభుత్వం అందజేసింది. ఆ భూములను కొందరు అక్రమార్కులు మాజీ సైనికుడి పేరుపై మార్చి, భూములను అమ్ముకుంటున్నారని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమిలో కొంత మంది భూ దందా చేసి నకిలీ ధృవపత్రాలను తయారు చేసి తమను ఆ భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమిని తమకప్పగించాలని అదనపు కలెక్టర్‌కిచ్చిన వినతిపత్రంలో కోరారు.

గడ్డమల్లయ్యగూడలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

పల్లె ప్రగతి పనులు భేష్

- కేంద్ర బృందం కితాబు
- గడ్డమల్లయ్యగూడలో పర్యటన

యాచారం, జూలై 11 : గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన పల్లె ప్రగతి పనులు భేషుగ్గా ఉన్నాయని కేంద్ర బృందం ప్రతినిధులు కితాబిచ్చారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ప్రాజెక్టు డైరెక్టర్లు, ప్రాజెక్టు అధికారులు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సమక్షంలో జిల్లా, మండల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. జమ్ముకశ్మీర్, నాగాలాండ్, ఒడిశా, కేరళ, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన 17 మంది జిల్లా స్థాయి అధికారులు గ్రామంలో పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ముందుగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ల్యాండ్ లెవలింగ్ పలు, జామ తోటలు, సీతాఫల్ తోటలు, ఫాంపాండ్, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఆవుల షెడ్లను స్వయంగా చూశారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు, పల్లె పకృతివనాల్లో ఏపుగా పెరిగిన మొక్కలు, హరితహారం చెట్లు, కంపోస్టు యార్డును పరిశీలించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా కొనసాగుతున్న కారం మిల్లు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను వారు స్వయంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై అధికారులను ఆరా తీశారు. కూలీలతో మాట్లాడి చేపట్టిన పనులు, డబ్బులు సకాలంలో వస్తున్నాయా అని అడిగారు. ఆవుల షెడ్డు, జామతోటలు పెంచుతున్న రైతులతో మాట్లాడి దిగుబడి, లాభాల గురించి, ప్రజలతో మాట్లాడి పలు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ కోర్స్ డైరెక్టర్ లకన్‌సింగ్ మాట్లాడుతూ.. మండలంలో పల్లె ప్రగతి పథకం కింద చేపట్టిన నర్సరీలు, పల్లె పకృతి వనాలు, హరితహారం మొక్కలు, క్రీడా ప్రాంగణాలు భేషుగ్గా ఉన్నాయన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి చేపట్టిన నర్సరీలు, పల్లె పకృతి వనాలు, హరితహారం పనులను పక్కాగా అమలు చేయడం అభినందనీయమన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తూ రైతుల పొలాలను అభివృద్ధి చేయడం బాగుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనికల్పించడంతో వారు కరువులో తగిన ఉపాధి పొందడం సంతోషకరమన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఆవుల షెడ్లు, తోటల పెంపకం తదితర పనులతో రైతులకు అండగా ఉండటంతో రైతు కుటుంబాలు బాగుంటాయని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు. మండలంలో పర్యటన విజయవంతంగా ముగిసినందున సంతోషంగా ఉన్నట్లు వారు స్పష్టం చేశారు. ఇక్కడి అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు ఆయన తెలిపారు.

మండలంలో పర్యటించినవారిలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అడిషనల్ డీఆర్‌డీవో సుభాషిణి, ఇబ్రహీంపట్నం అడిషనల్ పీడీ సక్రియానాయక్, ఎంపీవో శ్రీలత, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సుభాషిణి

మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సుభాషిణి

యాచారం, జూలై 11 : వనమహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ సుభాషిణి అన్నారు, మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో వనమహోత్సం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆశించిన స్థాయిలో మొక్కలు నాటాలన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఆమె కోరారు. మొక్కలు నాటేందుకు మండలంలో ఇప్పటివరకు గుర్తించిన స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. రైతుల పొలం గట్ల వద్ద, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు కార్యాలయాలు, రోడ్ల కిరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేసి నాటించాలని కోరారు. మొక్కలు నాటడంలో ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏపీవో లింగయ్య, ఈవో శివశంకర్‌రెడ్డి ఉన్నారు.



ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

పంట సాగు పరిశీలన

షాద్‌నగర్‌రూరల్, జూలై 11 : ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్ల, కొండన్నగూడ గ్రామాలను గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెలిజర్ల గ్రామంలో ఆయిల్‌పామ్, కూరగాయల సాగును పరిశీలించి, సాగుకు సంబంధించిన సబ్సిడీ, పెట్టుబడి, దిగుమతులు, మార్కెంటింగ్ తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్‌పామ్, ఇతర పంటల సాగుపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభాలు వచ్చే పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పంటల సాగుపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొండన్నగూడలోని రోలింగ్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి నీరజాగాంధీ, సెరికల్చర్ డీహెచ్ ముత్యాలు, హార్టికల్చర్ డివిజన్ అధికారి ఉషారాణి, ఆయిల్‌పామ్ మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ అధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు.

నెహ్రూనాయక్‌కు కేటీఆర్ భరోసా

బొంరాస్‌పేట, జూలై 11 : బొంరాస్‌పేట మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. గత నెలలో నెహ్రూనాయక్ భార్య పంచాయతీ కార్యదర్శి సుమిత్ర గ్రూప్-1 పరీక్ష రాసి వస్తుండగా బైక్‌పై నుంచి కిందపడి మరణించారు. గురువారం నెహ్రూనాయక్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని నెహ్రూనాయక్‌కు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దుద్యాల మండలాధ్యక్షుడు చాంద్‌పాషా, పార్టీ నాయకులు మధుయాదవ్, మహిపాల్ ఉన్నారు.

సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీఎస్ నాయకులు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

యాచారం, జూలై 11 : దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌కు దివ్యాంగులు గురువారం వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు మాట్లాడుతూ.. దివ్యాంగుల పింఛన్‌ను రూ.4వేల నుంచి 6వేలకు పెంచాలని కోరారు. పింఛన్‌ను ప్రతి నెల 5వ తేదీలోపు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. సదరం స్లాట్స్‌ను పెంచి, సదరం అప్పీలు రాష్ట్ర బోర్డుకు కాకుండా జిల్లా స్థాయిలోనే పరిష్కరించాలని కోరారు. ప్రతి మండలానికి ముగ్గురు సీసీలను దివ్యాంగుల సంక్షేమం కోసం గతంలో మాదిరి నియమించాలన్నారు. మనో వికాస కేంద్రాలకు పూర్వ వైభవం తెచ్చి, సిబ్బందికి హెచ్‌ఆర్‌సీ పాలసీని తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. దివ్యాంగులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక పరిశ్రమను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, ప్రభుత్వ శాఖలు, దివ్యాంగుల సంఘాలతో ప్రతి మూడు నెలలకోసారి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక సమావేశం ద్వారా దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు, జిల్లా నాయకులు జంగయ్య, బాల్‌రాజు, మహ్మద్ సలీం పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణ చర్యలు వేగవంతం చేయాలి

అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో స్పీకర్, ఎమ్మెల్యే

తాండూరు, జూలై 11 : రహదారుల నిర్మాణ చర్యలు వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ పనుల విషయంపై దృష్టి సారించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలసి వికారాబాద్ రోడ్డు మరియు భవనాల శాఖ అధికారులతో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో పాల్గొని తాండూరు నియోజకవర్గంలో పలు రహదారుల నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహించకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను స్పీకర్ ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే ఆదేశించారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలి

డీఆర్‌డీఏ డిజాస్టర్ మేనేజర్ నిర్మల

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేనేజర్ నిర్మల

చేవెళ్లటౌన్, జూలై 11 : మానవ అక్రమ రవాణా నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ డిజాస్టర్ మేనేజర్ నిర్మల తెలిపారు. గురువారం చేవెళ్లలో ప్రజల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ చేవెళ్ల అధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల పాడు నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి జ్యోతి ప్రజలన చేశారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే 3వ అతిపెద్ద నేరమని, ప్రతిరోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారని తెలిపారు. పేద, మధ్యతరగతివారు ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభారాణి, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ ఉన్నారు.

ప్రాణం తీసిన కుందేళ్ల వేట

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

మండలంలోని నంద్యానాయక్‌తండాలో ఘటన

బషీరాబాద్, జూలై 11 : పంటను కాపాడేందుకు పొలం చుట్టూ వేసిన విద్యుత్ (బైండింగ్ వైర్) తీగ ఓ యువకుడి ప్రాణం తీసిన ఘటన మండలంలోని నంద్యానాయక్‌తండాలో జరిగింది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన శంకర్‌రాథోడ్ కుమారుడు అవినాష్ రాథోడ్(19) పదో తరగతి వరకు చదువుకున్నాడు. బుధవారం రాత్రి తండాకు చెందిన స్నేహితులతో కలిసి తండా సమీపంలోకి కుందేళ్ల వేటకు వెళ్లాడు. తండాకు చెందిన ఓ వ్యక్తి తన పొలానికి అడవి జంతువుల రక్షణ కోసం బైండింగ్ వైర్‌తో విద్యుత్ కంచెను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రాత్రి వేళ గమనించని అవినాష్ పొలం సమీపంలో ఉన్న విద్యుత్ కంచెను తాకగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. భయాందోళనకు గురైన స్నేహితులు తండాకు వచ్చి విషయాన్ని కుటుంబీకులకు, తండావాసులకు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబీకులు అవినాష్‌ను చూసి బోరున విలపించారు. తండావాసుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.